సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2024



భక్తశ్రద్ధలతో సహస్ర దీపార్చన
పాడేరు పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు ఓకారం, శివలింగారం లో సహస్ర దీపార్చన నిర్వహించారు. IIలో



ఘనంగా సారె సమర్పణ
గూడెంకొత్తవీధి మండలం ధారకొండలో దేవి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. IIలో



తల్లీపిల్లల ఆరోగ్యంపై దృష్టి
తల్లీపిల్లల ఆరోగ్యంపై వైద్యసిబ్బంది దృష్టి సారించాలని ఏపీ నేషనల్ హెల్త్, నూరా హెల్త్ మిషన్ వైద్య బృందం సూచించింది. IIలో

న్యూస్‌రీల్

నేటి మీకోసం రద్దు

• కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈనెల 11వతేది శుక్రవారం పాడేరు ఐటీడీఏలో జరగాల్సిన మీకోసం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గాష్టమి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సెలవు దినమని తెలిపారు. ఈ కారణంగా మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి పాడేరు ఐటీడీఏకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

చింతపల్లి డీఎఫ్‌వోగా నర్సింహరావు



చింతపల్లి: అటవీ శాఖ చింతపల్లి డీఎఫ్‌వోగా వై.వెంకట నర్సింహరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకు విధులు నిర్వహించిన సూర్యనారాయణపడాల్ ఏలూరులోని సామాజిక అటవీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డీడీగా పనిచేస్తున్న వై.వెంకట నర్సింహరావును ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్థానిక అటవీశాఖ రేంజి అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పీఎం జన్‌మన్ గృహాలకు శంకుస్థాపన



సంపంగిపుట్టులో ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ సంపంగిపుట్టులో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్ పథకంలో నిర్మించిన 18 గృహాలను పాడేరు ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమ అనంతరం ఇదే గ్రామంలో పీఎం జన్‌మన్ పథకానికి సంబంధించి మంజూరైన 28 గృహాల్లో ఆరింటికి ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ పథకం ప్రయోజనాలపై డాక్యుమెంటరీని ఢిల్లీ నుంచి వచ్చిన బృందం సభ్యులు చిత్రీకరిస్తున్నట్టు ఆయన తెలిపారు.

డీఏఆర్ అడిషనల్ ఎస్పీగా ఎస్‌ఎల్ఎన్ రెడ్డి

సాక్షి,పాడేరు: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ (డీఏఆర్) అడిషనల్ ఎస్పీగా ఎస్‌ఎల్ఎన్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అనంతపురంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీగా పనిచేసిన వి.సత్తిరాజును పల్నాడు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

డీపీవోగా లవరాజు బాధ్యతల స్వీకరణ



డీపీవోకు అభినందనలు తెలుపుతున్న డీఎల్పీవో కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా పంచాయతీ అధికారిగా బి.లవరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం డ్వామాలో విజిలెన్స్ అధికారిగా పనిచేస్తున్న ఆయనను డీపీవోగా ప్రభుత్వం ఇటీవల బదిలీ నియమించింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనకు డీఎల్పీవో పీఎస్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

బంతి సాగు గిరి రైతులకు సిరులు కురిపిస్తోంది. ఒకపక్క దిగుబడి పెరిగింది. మరోపక్క దసరా సీజన్ కావడంతో మార్కెట్లో మంచి డిమాండ్ నెలకొంది. దీంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది.

బంతికి భలే ధర



పాడేరు మార్కెట్‌కు బుట్టలతో బంతిపూలను తీసుకువచ్చిన గిరిజన మహిళలు

- బుట్ట పువ్వులు రూ.300
- జనవరి వరకు మంచి డిమాండ్
- పోటీపడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- సీజన్‌లో ఒకొక్క రైతుకు రూ.40 వేలకు పైగా ఆదాయం



బంతిపూలను సేకరిస్తున్న గిరిజన మహిళ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని సీతమ్మ కాటుక బంతి రకాన్ని సాగు చేస్తున్న గిరిజన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. పాడేరు డివిజన్ పరిధిలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో కొండ పోడు, మెట్ట భూముల్లో ఈ రకం సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడి గణనీయంగా పెరిగింది.

తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్

ఏజెన్సీలో సాగవుతున్న బంతికి తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. దీనికి శరన్నవరాత్రి ఉత్సవాలు కూడా తోడవడంతో మంచి ధర పలుకుతోంది. వారం రోజుల నుంచి బంతిపూల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నందున వీటి వినియోగం పెరగడంతో మార్కెట్లో గిరాకీ ఏర్పడింది.

• జిల్లా కేంద్రమైన పాడేరు పాతబస్టాండు వద్ద మార్కెట్‌లో ప్రతిరోజూ పూల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వ్యాపారులంతా ఇక్కడ కొనుగోలు చేసిన బంతిపూలను ఎప్పటికప్పుడు అనకాపల్లి, తుని బైపాస్ రోడ్లకు తరలించి అక్కడ నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, చెన్నైతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



వ్యాపారులు భారీగా కొనుగోలు చేసిన బంతిపూలు



విజయవాడకు వ్యాన్‌లో లోడింగ్

బుట్ట రూ.300

గత వారం రోజుల నుంచి మన్యంలో చిన్నబంతి పూలకు డిమాండ్ పెరిగింది. మైదాన ప్రాంత వ్యాపారులు బుట్ట పూలను రూ.300కు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడికి నాలుగు మండలాలకు చెందిన గిరిజన రైతులు, మహిళలు ఉదయం సాయంత్రం వేళల్లో తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒకొక్క గిరి రైతు రోజుకు ఐదు బుట్టల వరకు అమ్ముతుండటంతో రూ.1500 ఆదాయం పొందుతున్నారు. సీజన్ ప్రారంభంలో మంచి ధర లభిస్తుండటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది.

కార్తీకమాసంలో..

దసరా తర్వాత కార్తీకమాసం కూడా సమీపిస్తుండడంతో డిసెంబర్ నెలాఖరు వరకు మన్యం బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. అక్టోబర్ నుంచి జనవరి వరకు వీటి అమ్మకాల ద్వారా ఒకొక్క రైతు సుమారు రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తుంది.

మంచి ఆదాయం



బంతి పూల అమ్మకాల ద్వారా ఏటా సీజన్‌లో మంచి ఆదాయం వస్తోంది. అక్టోబర్ నుంచి జనవరి వరకు అమ్మకాలు జరుగుతాయి. దసరా వల్ల పూలకు మంచి ధర పలుకుతోంది. ఈ వారంలో రెండు దఫాలుగా పాడేరు మార్కెట్‌లో 10 బుట్టల పూలు అమ్మాను. రూ.3 వేల వరకు ఆదాయం వచ్చింది.

– కె.కమలమ్మ, బంతి రైతు, ఈ.కొత్తూరు, పాడేరు మండలం

రతన్ టాటాకు అశ్రు నివాళి



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ ఉద్యోగులు, స్థానికులు

ముంచంగిపుట్టు: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు గురువారం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఉద్యోగులు, సిబ్బంది, ఒనకఢిల్లీలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు నివాళి అర్పించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన 86 ఏళ్ల ప్రస్థానంలో ఎంతో మందికి జీవితాన్నిచ్చిన పారిశ్రామిక రత్నం, మహోన్నత వ్యక్తి అని ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రమణేశ్వరరావు పేర్కొన్నారు.

ఏపీ జెన్‌కో ఈఈగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరణ

సీలేరు: ఏపీ జెన్‌కో ఈఈ(సివిల్)గా ఎం. శ్రీనివాస రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ జెన్‌కో విద్యుత్‌సౌధలో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడి ఈఈగా నియమించింది. ఈసందర్భంగా ఆయనకు పూర్వ ఈఈ భాస్కరరావు, డివిజన్ కార్యాలయంలో సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు అభినందనలు తెలిపారు.

హైవే పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: జాతీయ రహదారి పనులు నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. గురువారం ఆయన ఆంధ్రా, ఒడిశాలను కలుపుతూ నిర్మిస్తున్న జాతీయ రహదారి–326 పనులను డీఎఫ్‌వో బబితతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు భూముల పట్టాలకు సంబంధించి సమస్యలుంటే ఐటీడీఏకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కుయిగూరులో మిర్చి పంటను పరిశీలించిన పీవోకు తమకు ఐటీడీఏ ద్వారా డీజిల్ ఇంజన్లు మంజూరు చేయాలని రైతులు కోరారు. నాలుగు మండలాల్లో ఇంజన్లు కావాల్సిన రైతుల వివరాలు సేకరించి నివేదిక అందచేయాలని ఆయన హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. అనంతరం పీవో మండలంలోని ఎర్రగొండపాకలలో మల్బరీ పైరును పరిశీలించారు. సంబంధిత రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పంట ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. తులసిపాక పీహెచ్‌సీని పరిశీలించిన ఆయన అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.



మల్బరీ పైరును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్, తదితరులు

పార్కింగ్‌కు డబ్బులు వసూలు చేస్తే చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయిలో పార్కింగ్‌కు టెండర్ నిర్వహించకుండా డబ్బులు వసూలు చేస్తే పంచాయతీ సిబ్బంది, చాపరాయి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చాపరాయి వద్ద ప్రస్తుతం హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయిన తరువాత పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో వాహనాల పార్కింగ్‌కు టెండర్ నిర్వహించి వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు. పర్యాటక సీజన్‌లో ప్రత్యేక థింసా కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం 5నుంచి గిరిజన సంప్రదాయ పద్ధతిలో జరగాలని ఆదేశించారు. చాపరాయి ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించారు. స్థానిక మండల పరిషత్, ఎన్ఆర్ఈజీఎస్, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు.



చాపరాయిలో థింసా నృత్యం చేసే మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చిరుధాన్యాలతో ఆర్థికాభివృద్ధి : చిరుధాన్యాల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం సాగర పంచాయతీ బలియాగుడలో ఓ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తృణ ధాన్యాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిరైతులు పండించిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీపీఎం భాస్కర్‌రావు, ఏడీవో నందు, తహసీల్దార్ నాగమ్మ, వ్యవసాయ అధికారిణ/ నీలవేణి, సంస్థ ప్రతినిధులు. ఆర్‌ఐ హరి పాల్గొన్నారు.

గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ (విశాఖ): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి గురువారం గజలక్ష్మిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష గాజులతో పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా దర్శనమివ్వనున్నారని, శాకాంబరిగా అమ్మవారికి పూజ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శోభారాణి తెలిపారు.



లక్ష గాజుల పూజలో గజలక్ష్మిగా సిరులతల్లి

గిరిజనులకు తప్పని డోలీమోత

మహిళ మృతదేహాన్ని అవస్థలు పడి తరలించిన గిరిజనులు

చింతపల్లి: గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లేందుకు, ఆస్పత్రుల నుంచి ఇళ్లకు వచ్చేందుకు డోలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవల పాముకాటుకు గురైన గిరిజన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా ఆమె మృతదేహాన్ని రహదారి, రవాణా సదుపాయం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల మేర గిరిజనులు డోలీలో మోసుకుని ఇంటికి తీసుకువెళ్లాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. లంబసింగి పంచాయతీ జలగలగెడ్డ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కొర్రా నీలమ్మ(40) గతనెల 11న పాముకాటుకు గురైంది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహకారంతో లంబసింగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం నర్సీపట్నం, ఆ తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ 22 రోజులు చికిత్స పొందిన ఆమె పరిస్థితి విషమించడంతో ఈనెల ఒకటిన మృతి చెందింది. ఆమెను కుటుంబ సభ్యులు అంబులెన్సులో లంబసింగి తీసుకువచ్చారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఈనెల 2న డోలీలో గ్రామస్తుల సహకారంతో కుటుంబ సభ్యులు ఇంటికి తరలించారు. ఈ హృదయ విదారక ఘటన మన్యంలో గిరిజనుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది.

వైద్య కళాశాల భవన నిర్మాణాలు వేగవంతం

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.గురువారం ఆయన వైద్యకళాశాలకోసం నిర్మిస్తున్న అన్ని బ్లాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల జాతీయ మెడికల్ కౌన్సిల్ ఈఏడాది నుంచి వైద్య విద్య తరగతులకు అనుమతి ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి తరగతుల నిర్వహణకు అప్పగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, ఏపీఎస్ఎంఐడీసీ ఈఈ అచ్చెంనాయుడు, డీఈఈ వర్మ, ఏఈఈ సురేష్, డీజీఎం మధు పాల్గొన్నారు.



వైద్య కళాశాల భవనం లోపల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అథ్లెటిక్స్ పోటీల్లో అరకు విద్యార్థుల ప్రతిభ


బంగారు పతకాలు సాధన

అరకులోయ టౌన్: రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శెట్టి లోహిత్, టి.గోపాలకృష్ణ ప్రతిభ కనబరిచారు.ఈనెల 4, 5, 6 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో కళాశాలకు చెందిన శెట్టి లోహిత్ 200 మీటర్ల పరుగు పందెంలో కేవలం (22.47 సెకెన్లు), 400 మీటర్ల పరుగు పందెంలో 50 సెకెన్లలో పూర్తి చేసి ప్రథమస్థానం కైవసం చేసుకున్న బంగారు పతకం సాధించాడు. గోపాలకృష్ణ లాంగ్ జంప్‌లో 6.81 మీటర్లు దూకి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం పొందాడు. వీరిద్దరు ఈనెల 17,18,19, తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ తెలిపారు. వీరిని ఆయనతోపాటు స్పోర్ట్స్ ఇన్‌చార్జి పసుపులేటి నాగబాబు, పీడీ సమర్థి అప్పారావు, అధ్యాపకులు అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన లోహిత్, గోపాలకృష్ణ

విజయవాడకు కొత్త విమాన సర్వీసులు



గోపాలపట్నం (విశాఖ): విశాఖ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి విశాఖకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానయాన సంస్థ ఈ నెల 27 నుంచి రెండు కొత్త సర్వీస్‌లను ప్రారంభించనుంది. అలాగే 29న విజయవాడ నుంచి విశాఖకు ఇదే సంస్థ మరో సర్వీస్ ప్రారంభించనుంది. ఇందులో ఓ సర్వీస్ వారం రోజులూ అందుబాటులో ఉంటుంది. ఇది విజయవాడ నుంచి విశాఖకు ఉదయం 10.35 గంటలకు వచ్చి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుంది. మరో సర్వీస్ విజయవాడ నుంచి రాత్రి 8.55 గంటలకు విశాఖ చేరుకుని.. రాత్రి ఒంటి గంటకు తిరిగి విజయవాడ బయలుదేరుతుంది. ఇది సోమ, బుధ, శుక్ర, ఆది వారాల్లో అందుబాటులో ఉంటుంది. ఇదే విమానం 29వ తేదీ నుంచి రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుని తిరిగి రాత్రి ఒంటి గంటకు విజయవాడ బయలుదేరుతుంది. మంగళ, గురు, శని వారాల్లో ఈ సర్వీస్ అందుబాటులో ఉంటుందని విమానయాన సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

• మంచు సొగసు.. వెండి మబ్బులు





మన్యంలో ప్రకృతి రమణీయ దృశ్యాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 8 గంటల వరకు దట్టంగా కురుస్తున్న మంచుతో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. పాడేరు కలెక్టర్ బంగ్లా పరిసరాల్లో గురువారం ఉదయం ఒక పక్క మంచు అందాలు పాల సముద్రాన్ని తలపించగా, మరో పక్క వెండి మబ్బులు కనువిందు చేశాయి. - సాక్షి, పాడేరు

క్లుప్తంగా

ఘనంగా సారె సమర్పణ

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం ధారకొండలో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం 8 వరోజు దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సారెను గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, సమరతసేవా ఫౌండేషన్ కార్యకర్తలు, భవాని మాలధారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


రమణకుమార్ మృతదేహం

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ కేంద్రానికి చెందిన ధూళి రమణ కుమార్(30) పురుగుల మందు తాగి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు బంధువులు, ఆస్పత్రి వైద్యాధికారులు తెలిపారు. సమచారం తెలుసుకున్న ఎస్ఐ గోపాల్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సమస్యలతో రమణ మృతి చెంది ఉండవచ్చన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు చెప్పారు.

విశాఖ మదిలో రతన్ టాటా స్మృతులు


ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రతన్ టాటా(ఫైల్)


ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న రతన్ టాటా(ఫైల్)

- 2018లో ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశానికి రతన్ టాటా హాజరు
- దివంగత సీఎం వైఎస్సార్ విజ్ఞప్తి మేరకు అగనంపూడిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు
- గత సీఎం జగన్ చొరవతో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుకు సుముఖత

విశాఖ సిటీ: దిగ్గజ పారిశ్రామిక వేత్త.. దార్శనికుడు.. గొప్ప మానవతావాది.. అభినవ కర్ణుడు.. అజాతశత్రువు.. రతన్ నవల్ టాటాకు విశాఖతో కూడా అనుబంధం ఉంది. ఆయన నగరానికి కేవలం ఒక్కసారే వచ్చినప్పటికీ.. ఇక్కడి అందాలకు మంత్రముగ్ధులయ్యారు. ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పలు రంగాల్లో పరిశోధనలకు ఆలోచనలు చేశారు. దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రధానంగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేందుకు అగనంపూడిలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. దేశ పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపిన ధీశాలి రతన్ టాటా.. అనారోగ్యంతో ముంబై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దీంతో విశాఖలో ఆయన చేసిన పర్యటన.. విశాఖ అందాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అప్పటి ఆయన రాకను గుర్తు చేసుకుంటూ ఆయన మాటలను అనేక మంది బాధాతప్త హృదయాలతో నెమరువేసుకుంటున్నారు.

విశాఖపై ముద్ర

రతన్ టాటా ఒకే ఒకసారి విశాఖకు వచ్చారు. నగరంలో కొన్ని గంటల పాటు పర్యటించి ఇక్కడి అందాలకు ఫిదా అయిపోయారు. 2018, డిసెంబర్ 10వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రతన్ టాటా తొలిసారిగా విశాఖలో అడుగుపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలో పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఏయూలో జరిగిన కార్యక్రమానికి హాజరై విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. రతన్ టాటా వస్తున్నట్లు తెలుసుకున్న ఏయూ పూర్వ విద్యార్థులు ఎప్పుడూ లేని విధంగా ఈ కార్యక్రమానికి పోటెత్తారు. 6 వేల మంది పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఏయూ విద్యార్థులు కూడా వేల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటలకు విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఏయూ ప్రాశస్త్యం, ఔన్నత్యం పూర్తిగా తెలియనప్పటికీ.. ఇక్కడకు వచ్చాక యూనివర్శిటీ ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. 'ఆంధ్రా యూనివర్సిటీతో కలిసి ఏం చేయాలో అన్వేషించాలనుకుంటున్నాను. డేటా అనలిటిక్స్, హ్యూమన్ జెనోమిక్ సీక్వెన్సింగ్, ప్రెడిక్టివ్ బిజినెస్ రంగాల్లో టాటా గ్రూప్, ఏయూ మధ్య అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తాను విశాఖలో కొద్ది గంటలే పర్యటించినప్పటికీ.. నగరం ఆకట్టుకుందని కితాబిచ్చారు. ఈ మాటలకు ఆ సభ హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

నాడు తండ్రి.. నేడు కొడుకు విజ్ఞప్తుల మేరకు..

ముంబై కేంద్రంగా ఉన్న తన వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రపంచంలో అనేక దేశాల్లో విస్తరించిన రతన్ టాటా విశాఖలో మాత్రం క్యాన్సర్ రోగుల కోసం ఆస్పత్రిని నెలకొల్పారు. 2004–09 మధ్య అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విశాఖలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని రతన్ టాటాను విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం అగనంపూడిలో స్థలాన్ని కూడా కేటాయించారు. దీంతో వైఎస్సార్ మరణం తరువాత కూడా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఇప్పుడు వేలాది మంది క్యానర్స్ బాధితులకు చికిత్స అందిస్తోంది. అలాగే 2019–24 మధ్య గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రతిష్టాత్మకమైన టీసీఎస్ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కూడా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఆ చొరవ కారణంగానే ప్రస్తుతం విశాఖలో టీసీఎస్‌లు అడుగులు పడబోతున్నాయి. తాజాగా ప్రభుత్వం మారినప్పటికీ.. విశాఖలో టీసీఎస్ సంస్థ ఏర్పాటు విషయంపై ప్రస్తుత రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా బుధవారమే ప్రకటించారు. అదే రోజు సాయంత్రం రతన్ టాటా కన్నుమూశారు. రతన్ టాటాకు విశాఖతో దీర్ఘకాల అనుబంధం లేకపోయినప్పటికీ.. ఇక్కడ ఐటీ సేవలు విస్తరించడానికి అడుగులు పడుతున్న సమయంలో మరణించడం బాధాకరం.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఐటీడీఏ పీవో సింహాచలం


పెదగెద్దాడ పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యులను ఆదేశించారు. పెదగెద్దాడ పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రతి రోజు ఓపీకి వస్తున్న రోగుల సంఖ్య, వైద్యాధికారులు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసులపై వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ పీహెచ్‌సీలకు వచ్చిన రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి, వ్యాధిని గుర్తించి త్వరితగతిని చికిత్స అందించాలన్నారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపార్చన


పూజల్లో పాల్గొన్న భక్తులు


పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని భవాని మాలధారులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ఆస్పత్రి సెంటర్ వద్ద విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి మహిళలంతా భక్తిశ్రద్ధలతో ఓంకారం, శివలింగాకారంలో దీపార్చన చేశారు.ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెయ్యాకుల సత్యనారాయణ, యాదగిరి శ్రీను, పచ్చా మాణిక్యాలరావుల ఆధ్వర్యంలో దీపార్చన కార్యక్రమం జరిగింది.

స్థానిక ఉమానీలకంఠేశ్వర సమేత రాజరాజేశ్వరి ఆలయంలో రాత్రి భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త మండలి,ఆధ్యాత్మిక కమిటీల ఆధ్వర్యంలో అర్చకులు రామంపంతులు పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

వైభవంగా దుర్గాష్టమి పూజలు

- కనకదుర్గమ్మ అలంకరణలో దుర్గాదేవి
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు


పాడేరు కనకదుర్గమ్మ అలంకరణలో మోదకొండమ్మతల్లి


కనకదుర్గమ్మ అలంకరణలో భ్రమరాంబదేవికి కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు


కనకదుర్గ అమ్మవారి అవతారంలో దుర్గాదేవి


పాడేరులోని కనకదుర్గమ్మ అలంకరణలో రాజరాజేశ్వరిదేవి


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు /జి.మాడుగుల/చింతపల్లి: విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతున్నాయి.7వరోజు గురువారం జిల్లాలోని అమ్మవార్ల విగ్రహాలను కనకదుర్గదేవిగా అలంకరించి భక్తులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకులోయలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవి విగ్రహాన్ని కనకదుర్గదేవిగా అలంకరించారు. ప్రధాన అర్చకులు వెంకటేశ్వరుడు, వెంకటరమణమూర్తిల ఆధ్వర్యంలో సాముహిక కుంకుమార్చన జరిపారు. పాడేరులోని కనకదుర్గమ్మతల్లి, రాజరాజేశ్వరి, మోదకొండమ్మతల్లి ఆలయాల్లో అర్చకులు రామం, సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.జి.మాడుగులలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భవానీ మాలధారులు నడిచారు. చింతపల్లి రంగాసెంటర్‌లో వెలసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బేకరీలో వ్యక్తి ఆత్మహత్య


అనుమానస్పద స్థితిలో మృతదేహం


దేముడునాయుడు (ఫైల్)

అరకులోయ రూరల్ : మండల కేంద్రంలో గల రాజస్థాన్ స్వీట్ షాపు బేకరిలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ గోపాల్‌రావు కథనం ప్రకారం విజయనగరం జిల్లా వేపాడ మండలం, పెద్ద గుడిపాలెం గ్రామానికి చెందిన దేముడునాయుడు (32) అరకులోయలో రాజస్థాన్ స్వీట్ షాపు (బేకరి)లో పనిచేస్తున్నాడు. చిన్న అనే వ్యక్తి మణికంఠ స్వీట్‌షాపు బేకరీలో కేక్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా పరిచయం ఉంది. నాలుగు రోజుల క్రితం చిన్నకు చెందిన బైక్‌ను అడిగి దేముడునాయుడు తీసుకెళ్లాడు. అతని వద్ద నుంచి మరో వ్యక్తి బైకు తీసుకెళ్లి తిరిగి ఇవ్వలేదు. దీంతో కేక్ మాస్టర్ చిన్న ఈనెల 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున బేకరిలో దేముడునాయుడు ఉరివేసుకుని కనిపించాడు. భయంతోనే అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. బేకరీ నిర్వాహకుల సమాచారంతో సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా దేముడు నాయుడు మృతిపై అనుమానంగా ఉందని, పూర్తి విచారణ జరిపించాలని మృతుడి అన్న ఈశ్వరరావు కోరారు.

మన్యంలో సేవలు విస్తరించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్


గిరిజన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేట: మండల కేంద్రంలో కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం పర్యటించారు. ఆయన స్థానికులతో మాట్లాడుతూ మన్యంలో స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎన్‌జీవో సంస్థలు మన్యంలో గిరిజన రైతుల కోసం సోలార్ ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, జీవామృతం తయారీ యూనిట్లు, నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల రైతులకు సాగునీటి సమస్య ఉండదని, కాఫీ రైతులకు కాఫీ గింజల డ్రైయింగ్ తదితర సామగ్రి వల్ల ఎంతో లాభదాయకమన్నారు. ఈ సందర్భంగా వాసన్ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. వారి సేవలను మన్యంలో మరింత విస్తరించాలన్నారు. ఐటీడీఏ ద్వారా ఇచ్చిన 121 మినీ సోలార్ ప్యానల్ మరమ్మతు బాధ్యతను ఈ వాసన్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన యువతకు ఇవ్వాలని స్థానిక డీఈని సూచించారు. వ్యవసాయ శాఖ జేడీ ఎస్ఎంఐ డీఈ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నరసింహారావు, ప్రసాద్, విమల్, నాయుడు, దామోదర్ పాల్గొన్నారు.

తల్లీపిల్లల ఆరోగ్యంపై దృష్టి


జి.మాడుగుల: తల్లీపిల్లల ఆరోగ్యం మెరుగుపై వైద్యసిబ్బంది దృష్టి సారించాలని ఏపీ నేషనల్ హెల్త్, నూరా హెల్త్ మిషన్ వైద్య బృందం సూచించారు. గురువారం మండలంలో లువ్వాసింగి పంచాయతీ వంద్రంగిపాడును బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో హెల్త్ కేర్ కంపానియన్ ప్రోగ్రాం(సీసీపీ) నిర్వహించారు. వీరికి స్థానికులు గిరిజన సంప్రదాయంలో స్వాగతం పలికారు. వారికి అడ్డాకుల టోపీలతో అలంకరించారు. బృందం సభ్యులు జయభార్గవి, హేమంత్‌కుమార్, ప్రీతం, సీహెచ్‌వో జెఎస్ఎస్ సీహెచ్‌వో సాయి కుమార్ మాట్లాడారు. ఆరోగ్య సమస్యలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్యసేవలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు అందిస్తున్న వైద్యసేవల వివరాలను వారు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర హెల్త్ అసిస్టెంట్ బాలయ్య, ఏఎన్ఎంలు ఇంద్రలత, చిన్నమ్మలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- విజయవాడకు 4 ప్యాకేజీలతో 40 బస్సులు
- హైదరాబాద్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మరో 20
- అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి నుంచి మూడు రోజులపాటు స్పెషల్ బస్సులు

నర్సీపట్నం నుంచి విజయవాడకు ప్రత్యేక ప్యాకేజీ చార్జీలు

సర్వీసు	పల్లె వెలుగు	అల్ట్రా పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్
హైవే మీదుగా	రూ.800	రూ.900	రూ.1000	రూ.1250
వయా ద్వారపూడి	రూ. 860	రూ.970	రూ.1070	రూ.1350
వయా ద్వారకా తిరుమల	రూ.910	రూ. 1030	రూ.1140	రూ.1420
వయా గొల్లలమామిడాడ	రూ.970	రూ.1090	రూ.1210	రూ.1510
వయా భద్రాచలం	రూ.1190	రూ.1340	రూ.1490	రూ.1860



సాక్షి, అనకాపల్లి: దసరా పండగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రజారవాణా శాఖ (ఏపీఎస్ఆర్టీసీ) ప్రత్యేక సర్వీసులను నడపనుంది. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఇందుకోసం 60 స్పెషల్ బస్సులను సిద్ధం చేశారు. వీటిని 11, 12, 13 తేదీల్లో నడపనున్నారు. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. అనకాపల్లి నుంచి విజయవాడకు వెళ్లే రోజువారీ సర్వీసులను యథాతథంగా కొనసాగిస్తూ స్పెషల్ సర్వీసులు వేస్తున్నారు. భక్తుల

భవానీ భక్తులకు 4 ప్యాకేజీల్లో సర్వీసులు

విజయవాడలో కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు వెళ్లే భవానీ భక్తుల కోసం ఆర్టీసీ 4 ప్యాకేజీలతో అదనంగా ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ సర్వీసులతోపాటు ఈ ప్రత్యేక సర్వీసులు అదనంగా నడపనుంది. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 40 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇవి కాక అనకాపల్లి డిపో నుంచి విశాఖపట్నం, పాయకరావుపేట, విజయనగరం, పలాస, రాజమండ్రి, విజయవాడకు పది, నర్సీపట్నం డిపో నుంచి హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నంలకు మరో పది ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే..



అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి ఈనెల 11, 12, 13 తేదీల్లో 40 ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇవి కాక ఆ రెండు డిపోల నుంచి హైదరాబాద్‌కు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మరో 20 బస్సులు నడుపుతాం. అవసరమైతే 14వ తేదీన కూడా స్పెషల్ సర్వీసులను పొడిగిస్తాం. ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నాం.

– పద్మావతి, జిల్లా ప్రజారవాణా శాఖ (ఆర్టీసీ) అధికారి